జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 24-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 571 పేజీలు: 4 వెల: రూ.7





# వెలుగుల రేడు వేడుకకు..



# వేళాయే!

✳ నేటి అర్ధరాత్రి నుంచే రథసప్తమి సంబరం ✳ అరసవల్లిలో తెల్లవారుజామున ఒంటిగంటకే క్షీరాభిషేకం ✳ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల నుంచి నిజరూప దర్శనం ✳ సాయంత్రం 4 నుంచి స్వర్ణాలంకరణ ✳ అరసవల్లిలో ఆరు అంచెల దర్శన వ్యవస్థ ✳ 2600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ✳ కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రత్యేక నిఘా ✳ భాస్కర క్షేత్రంలో సూర్యజయంతి వేడుకలకు సర్వం సిద్ధం

**శ్రీకాకుళం, జనవరి 24 (వార్త):** ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి రథసప్తమి వేడుకలు శనివారం అర్ధరాత్రి నుంచే అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. 'సప్తాహ సూర్య పర్వం'లో భాగంగా ప్రధాన ఘట్టమైన రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వం ఈ ఉత్సవాలను 'రాష్ట్ర పండుగ'గా ప్రకటించిన నేపథ్యంలో, మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భాస్కర క్షేత్రం భక్తిపారవశ్యంతో పులకించనుంది. ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి ఉదయం 8 గంటల వరకు స్వామివారికి 'మహాక్షీరాభిషేక సేవ' నిర్వహించనున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగే ఈ విశేష క్రతువును వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. అనంతరం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం లభిస్తుంది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామి వారు స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. భద్రతా పరంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 250కి పైగా సీసీ కెమెరాలతో ప్రతి కదలికను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నగరంలో వాహనాల మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పలుదఫాలుగా సమీక్షలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇతర జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు.


## వైభవంగా శోభాయాత్ర



సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. 55 రకాలకు పైగా జానపద, సాంప్రదాయ కళారూపాలు, వివిధ క్షేత్రాల దైవ శకటాలతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కె.ఆర్.స్టేడియం వద్ద రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ వెంట రాగా సాంప్రదాయ డప్పులు కొట్టి శోభాయాత్రను వైభవంగా ప్రారంభించారు. ఈ యాత్రలో సూర్యరథం, సింహాచలం, అన్నవరం, కనకదుర్గమ్మ వంటి ప్రముఖ క్షేత్రాల నమూనా శకటాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మహిళల కర్రసాము, అఘోరాల వేషధారణలు, కేరళ డ్రమ్స్, థింసా నృత్యాలు యాత్రకు వన్నె తెచ్చాయి. డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి, సూర్యమహల్, మిల్ జంక్షన్ మీదుగా అరసవల్లి ఆలయం వరకు సాగిన ఈ ప్రదర్శనను తిలకించేందుకు భక్తజనం పోటెత్తారు.

## రథసప్తమి వేడుకలకు పటిష్ట పోలీసు బందోబస్తు: ఎస్పీ

జిల్లాలో జరగనున్న రథసప్తమి వేడుకలు ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. మొత్తం బందోబస్తు వ్యవస్థను 20 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు



ప్రత్యేక అధికారులను నియమించి స్పష్టమైన బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ బందోబస్తు ఏర్పాట్లు ఆరుగురు అదనపు ఎస్పీల పర్యవేక్షణలో, 16 మంది డీఎస్పీలు, 50 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లు, 170 మంది ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిపి సుమారు 2500 మంది పోలీసు సిబ్బందితో అమలు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతను మరింత బలోపేతం చేసేందుకు 15 డ్రోన్లు, 180 సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వివరించారు.










# అంగరంగ వైభవం..

# శోభాయమానం!

✳ శోభాయాత్రలో పెద్ద ఎత్తున పలు ఆలయాల నమూనా వాహనాలు
✳ అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు విచిత్ర వేషధారణలు ✳ తిలకించేందుకు తరలివచ్చిన నగరవాసులు ✳ ధగధగ మెరిసిన సిక్కోలు నగరం













జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రథసప్తమికి ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** అరసవిల్లి సూర్యనారాయణ స్వామివారి క్షేత్రంలో ఈ నెల 25న జరగనున్న రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి (డీపీటీఓ) సి.హెచ్. అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రధాన కేంద్రాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా అదనపు సర్వీసులను అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయనగరం, రాజాం, పాలకొండ, బత్తిలి, శ్రీముఖలింగం, పాతపట్నం, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ బస్సుల్లో ఎటువంటి అదనపు బాదుడు లేకుండా సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు డీపీటీఓ స్పష్టం చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అరసవిల్లికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాంప్లెక్స్ నుంచి డే అండ్ నైట్ జంక్షన్, ఏడు రోడ్ల కూడలి, జిల్లా పరిషత్ మీదుగా పసగడ సూర్యనారాయణ మిల్లు వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. వేడుకల అనంతరం తిరుగు ప్రయాణం అయ్యే భక్తులు కూడా పసగాడ మిల్లు వద్ద సిద్ధంగా ఉండే బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.




### అరసవల్లిలో ఆరు అంచెల
## దర్శన వ్యవస్థ

**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** రథసప్తమి వేడుకల్లో అత్యంత కీలకమైన 'స్వామివారి క్షీరాభిషేకం' శనివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కానుంది. రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆలయ పరిసరాలను ఆరు ప్రత్యేక సెక్టార్లుగా విభజించి దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులు తమకు కేటాయించిన మార్గాల్లోనే వెళ్లేలా యంత్రాంగం అన్ని చోట్లా సైన్ బోర్డులను ఏర్పాటు చేసింది.

### సెక్టార్ల వారీగా దర్శన మార్గాలు:

సెక్టార్ 1: మామిడి తోట జంక్షన్ నుంచి అసిరితల్లి ఆలయం మీదుగా సామాన్య భక్తులు వెళ్లే మార్గం. ఇక్కడ రూ. 100 తో పాటు ఉచిత దర్శనం లైన్లు ఉంటాయి.

సెక్టార్ 2: ఇంద్ర పుష్కరిణి పరిసర ప్రాంతం. క్యూలైన్లలో రద్దీ పెరిగినప్పుడు భక్తులు ఇక్కడి వెయిటింగ్ కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండాలి.

సెక్టార్ 3- 3ఏ: (విఐపి ల కోసం) బొంపడ వీధి నుంచి వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) వరకు ఉండే వి.ఐ.పి ఎంట్రీ మార్గం.

సెక్టార్ 4 (ప్రధానాలయం - సంగమ స్థలం): అన్ని క్యూ లైన్లు ఇక్కడే కలుస్తాయి. గర్భాలయం లోపల ఆరు వరుసల్లో భక్తులు సులువుగా స్వామిని చూసేలా అడుగు, రెండు అడుగులు, మూడు అడుగుఎత్తైన క్యూలైన్ సిద్ధం చేశారు.

సెక్టార్ 5 (బయటకు వెళ్లే మార్గం): దర్శనం ముగిసిన తర్వాత భక్తులు బ్రాహ్మణ వీధి గుండా బయటకు రావాలి. ఇక్కడే ప్రసాద కౌంటర్లు, పాదరక్షల స్టాండ్లు అందుబాటులో ఉంటాయి.

సెక్టార్ 6 (ప్రధాన రహదారి): మిల్ జంక్షన్ నుండి అసిరితల్లి ఆలయం వరకు ఉండే మెయిన్ రోడ్డు. ఇక్కడ కేవలం పాసులు ఉన్న వాహనాలను, అత్యవసర సర్వీసులను మాత్రమే అనుమతిస్తారు

సెక్టార్ 7: సూర్య మహల్ జంక్షన్ నుంచి మామిడి తోట వరకు ఉండే ప్రాంతం. ఇక్కడ భక్తుల నియంత్రణ కోసం ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు.

సెక్టార్ 8: పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి సూర్య మహల్ వరకు ఉండే మార్గం. రద్దీని బట్టి భక్తులను ఇక్కడి నుంచే క్రమబద్ధీకరిస్తారు.

అర్ధరాత్రి నుంచే క్షిరాభిషేక సేవలు మొదలవుతున్నందున, రద్దీని బట్టి క్యూలైన్లను నియంత్రించనున్నారు. భక్తుల వాహనాలకు సెక్టార్ 9 (80 అడుగుల రోడ్డు) వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ఈసారి విఐపి వాహనాలు వెనకకు రాకుండా లక్ష్మీ నగర్ కాలనీ మీదుగా డీఈఓ కార్యాలయం రోడ్డులో నుంచి బయటకు వస్తాయి.

### ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు ఉపయోగించొద్దు



**శ్రీకాకుళం, జనవరి23 (వార్త):** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డు కూడలిలో రథసప్తమి వేడుకల సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా ఎన్విరాన్మెంట్ ఛైర్మన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ సంచులను వాడాలని పిలుపునిచ్చారు. రథసప్తమి కి వచ్చే భక్తులు ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు ఉపయోగించకుండా నగరాన్ని సుందరంగా ఉంచడంలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీపిఓ భారతి సౌజన్య, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి, ఉంగటి రమణ, లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ, సభ్యులు రమ్య, చౌదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా ముగిసిన నాటక ప్రదర్శనలు

**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** సురభి నాటక మండలి అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న కళా ఉత్సవాలు శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా ముగిశాయి. చివరి రోజు కావడంతో సురభి వారి సిగ్నేచర్ నాటకమైన మాయాబజార్‌ను ప్రదర్శించారు. వెండితెరపై చూసిన అద్భుతాలను ప్రత్యక్షంగా రంగస్థలంపై వీక్షించిన ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. నాటకంలో భాగంగా ప్రదర్శించిన 'సత్యభామ తులాభారం', 'ఘటోత్కచుని మాయలు', 'లక్ష్మణ కుమారుని వివాహ యత్నం' వంటి ఘట్టాలు కనువిందు చేశాయి. ముఖ్యంగా సురభి వారి ప్రత్యేకత అయిన సాంకేతిక పరిజ్ఞానం ఈసారి కూడా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాయి. వేదికపై అప్పటికప్పుడు మాయా దీపాలు వెలగడం, ఆకాశంలో మేఘాల మధ్య కృష్ణుడు కనిపించడం, లడ్డూలు గాల్లోకి ఎగరడం వంటి దృశ్యాలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణుడు, శకుని, ఘటోత్కచుడు, శశిరేఖ పాత్రల్లో కళాకారులు జీవించారు. స్పష్టమైన వాచికం, పౌరాణిక వేషధారణతో పాత్రలకు ప్రాణం పోశారు. హార్మోనియం, తబలా సవ్వడుల మధ్య సాగిన పద్యాలు, పాటలు ఆహూతులను అలరించాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన సురభి కళాకారుల ప్రతిభను నగర ప్రజలు వేనోళ్ల కొనియాడారు.



# పదివేల మందితో సూర్య నమస్కారాలు

✻ 80 అడుగుల రోడ్డులో యోగా విన్యాసాలు








**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** సిక్కోలు రథసప్తమి ఉత్సవాల వేళ 80 అడుగుల రోడ్డు యోగ వేదికగా మారింది. శుక్రవారం ఉదయం భానుడి లేత కిరణాల సాక్షిగా నిర్వహించిన 'మెగా సూర్య నమస్కారాలు' కార్యక్రమం కనువిందు చేసింది. దాదాపు పదివేల మంది విద్యార్థులు, యోగ సాధకులు ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేస్తూ నగరాన్ని ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్యంతో నింపేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ స్వయంగా స్టేజ్ పై యోగ ముద్రలను ప్రదర్శిస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. యోగ గురువుల పర్యవేక్షణలో వేల సంఖ్యలో తరలివచ్చిన జనసందోహం క్రమశిక్షణతో సూర్య నమస్కారాలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, జిల్లా ఆయుష్ అధికారి జగదీష్, అరసవల్లి ఈఓ ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, మాజీ మున్సిపల్ చైర్?పర్సన్ పైడిశెట్టి జయంతి, మంత్రి వెంకటస్వామి, డిపిఓ భారతి సౌజన్య ఆసనాలు వేశారు. షిరిడీ సాయి యోగ కేంద్రం (రసజ్ఞ), ఆసీస్, దినేష్ బృందం యోగ గీతాలతో కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. రామారావు, చిన్నబాబు (పతంజలి), ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి కల్పన, ఆదినారాయణ, తంగి స్వాతి, గాయత్రి, అర్చన, పాండ్రంకి మురళీకృష్ణ, పి. వాసంతి, శ్రీనివాస శర్మ, ఓం శాంతి జయలక్ష్మి తదితర యోగ శిక్షకులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వివిధ విద్యాసంస్థలు, యోగ శిక్షణ కేంద్రాల ప్రతినిధులు, పతంజలి యోగ సెంటర్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

### సిక్కోలు గగనాన..
## అద్భుత దృశ్య కావ్యం


✻ కోడి రామ్మూర్తి స్టేడియంపై డ్రోన్ల విన్యాసం ✻ ఆధ్యాత్మికత, సంస్కృతి మేళవింపుతో కనువిందు ✻ తిలకించి మురిసిపోయిన జనం




**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శుక్రవారం రాత్రి ఆకాశంలో ఓ అద్భుత దృశ్య కావ్యం ఆవిష్కృతమైంది. రథసప్తమి వేడుకల సందర్భంగా నిర్వహించిన డ్రోన్ షో నగర వాసులను మంత్రముగ్ధులను చేసింది. వందలాది డ్రోన్లు ఒక క్రమ పద్ధతిలో ఆకాశంలోకి ఎగిరి, రంగురంగుల వెలుగులతో జిల్లా విశిష్టతను చాటిచెప్పేలా చేసిన ప్రదర్శన కన్నుల పండువగా సాగింది. అపురూప ఆకృతులు ప్రదర్శన ప్రారంభంలోనే ఆకాశంలో 'సిక్కోలు రథసప్తమోత్సవాలు 2026' అనే అక్షరాలు మెరిసిపోగా భక్తులు జయజయధ్వానాలు చేశారు. ఆ వెంటనే భానుడి రథం, సూర్యభగవానుడి దివ్య రూపం వెలిగింది. అష్టలక్ష్మి స్వరూపంగా లక్ష్మీదేవి ఆకారం ఆకాశంలో ప్రత్యక్షమవ్వడం భక్తి పారవశ్యాన్ని నింపింది. అలాగే శ్రీకాకుళం జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అంశాలను డ్రోన్ల ద్వారా ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 75 ఇయర్స్ ఆఫ్ శ్రీకాకుళం అనే ఆంగ్ల అక్షరాలతో డ్రోన్లు ప్రత్యక్షమయ్యాయి. అలాగే ఆంగ్ల అక్షరాల్లో 'పలాస క్యాస్యు' అని రాసి ఉన్న ఆకారం అందరినీ ఆకట్టుకుంది. గాంధీజీ మెచ్చిన పొందూరు ఖాదీకి చిహ్నంగా రాట్నం ఆకారం ఆకాశంలో స్పష్టంగా పొందూరు ఖాదీ అంటూ కనిపించింది. ఆంధ్రప్రదేశ్, ఇండియా మ్యాప్ లు డ్రోన్ల సహాయంతో ఆకాశంలో అద్భుతంగా ఆవిష్కరించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఆయన చిత్రంతో పాటు 'సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ' పేరు ఆకాశంలో వెలిగిపోయింది. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి ఉన్నట్లు చిత్రాలను డ్రోన్లు అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శించాయి. స్టేడియంలో ఉన్న వేలాది మంది ప్రజలు తమ సెల్‌ఫోన్లలో ఈ అద్భుత దృశ్యాలను బంధించారు. జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఈ ప్రదర్శనను పర్యవేక్షించారు. ఈ అద్భుత ప్రదర్శన శ్రీకాకుళం నగర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సిక్కోలు గడ్డపై.. క్రీడా పండగ!

✻ ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ✻ క్రీడాజ్యోతి వెలిగించిన కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ✻ ముఖ్యమంత్రి చొరవతోనే రథసప్తమి రాష్ట్ర ఉత్సవాలు ✻ ఎమ్మెల్యే గొండు శంకర్




**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతన బోర్డు కార్పొరేషన్ చైర్మన్ పి.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రథసప్తమి రాష్ట్ర ఉత్సవాల సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ గ్రామీణ క్రీడా పోటీలను ఆయన క్రీడాజ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రథసప్తమి వేడుకలను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి, ముఖ్యంగా నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు 13 జిల్లాల జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల నిర్వహణలో ఎమ్మెల్యే గొండు శంకర్ చూపుతున్న చొరవను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పండుగగా సిక్కోలు రథసప్తమిని నిర్వహించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారం ఎంతో గొప్పదని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ ద్వారా జిల్లా గౌరవం పెరగడంతో పాటు విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని వివరించారు. ఈ ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంతగానో కృషి చేశారని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్రబాబు, పీఏసీఎస్ చైర్మన్ కొండ వెంకట రామమూర్తి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి, అందవరపు సంతోష్, క్రీడా సంఘాల ప్రతినిధులు కె.వి. ప్రభావతి, శ్రీనివాసరావు, ఎలమంచిలి శ్రీకాంత్, సుందర్ రావు, అర్జునరావు, ముసలినాయుడు మాస్టర్, క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

### రూ.35 లక్షల విలువైన బంగారం స్వాధీనం

**నరసన్నపేట, జనవరి 23 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగిన వరుస చోరీల కేసులలో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొత్తం 12 చోరీ కేసులకు సంబంధించి నిందితుల నుంచి సుమారు రూ.35 లక్షల విలువైన 31 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ కేసుల్లో అచ్యుతరావు, యోగేశ్వరరావు, నరేంద్ర అనే ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.





### ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు

**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ పి. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడంతో పాటు నిరుపేద మహిళలకు చీరలను అందజేశారు. ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అరసవల్లిలో చాతుర్వార సూర్యనమస్కారాలు



**శ్రీకాకుళం, జనవరి 23(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలోని అనివెట్టి మండపంలో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా 12 మంది ఋత్విక్కులచే చాతుద్వార సూర్యనమస్కారాలు నిర్వహించారు. అరుణ ప్రయుక్త, తృణ మహజంరా మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా ఈ క్రతువును పూర్తి చేశారు. లోక కల్యాణార్థం సాగిన ఈ పూజలో భక్తులు పాల్గొన్నారు. శనివారం ఆలయంలో మహసౌర హోమం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

# నారాయణలో వసంత పంచమి

**శ్రీకాకుళం, జనవరి 23 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని మధురానగర్‌లోగల నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శుక్రవారం వసంత పంచమి పూజలు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి దేవి చిత్రపటం వద్ద విద్యార్థులచే పూజలు చేయించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఆర్ఐ రాంబాబు, ప్రిన్సిపాల్ భాస్కరరావు మాట్లాడుతూ విద్యా, వాక్కు, బుద్ధి, వివేకం, కళలకు ఆదిదేవత సరస్వతి దేవి అని, విద్యార్థులందరూ ఆ సరస్వతీ దేవి కృపాకటాక్షాలతో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు అర్చకులతో పాటు ఉపాధ్యాయులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్‌లు రమణమూర్తి, పాపారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.











Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546